# 'అమ్మ'కం

-ఇద్దా శ్రీనివాసరామ్

**క్రిరుమనే శబ్దం విని అటువైపు చూసాడు కుమార్. ఓ అరవై యేళ్ళ ముసలావిడ కుర్చీ ప్రక్కకు జరిపి, కుర్చీలో ఎదురుగా కూర్చుంది. తల అటూ యిటూ త్రిప్పడం తప్ప, శరీరం లోని ఏ అవయవం కదలడానికి సహకరించడం లేదు కుమార్‌కి. అతనికి జరిగిన యాక్సిడెంట్ అలాంటిది.**

బావున్నావా? నేను గుర్తున్నానా? విజయవాడలో మీ పక్కింట్లో వుండే దాన్ని. నీకు యాక్సిడెంట్ అయిందని తెలిసి, నిన్ను చూసి పోదామని వచ్చాను. ఈ హాస్పటల్‌లోనే నా కళ్ళకు ఆపరేషన్ జరిగింది. రెండు కళ్ళూ ఎవరివో అమర్చారు. కళ్ళు యిప్పుడు బాగా కనబడుతున్నాయి. నీకు జరిగిన యాక్సిడెంట్ చాలా ఘోరం అనిపిస్తుంది. మీ అమ్మ చనిపోయిన రోజునే నీకిలా జరగడం దురదృష్టం.

మీరు టీచర్ కరుణగారు కదూ?

అవును, చాలా బాగా గుర్తుంచుకున్నావ్. నువ్వు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తాను. మంచివాళ్ళకు మంచే జరుగుతుంది.

టీచర్ కరుణ వెళ్ళిపోవడానికి లేచింది. ఆ క్షణంలో ఆమె కళ్ళలోకి చూసాడు కుమార్. ఒక్కసారిగా నరాలు జివ్వుమన్నాయి. చైతన్యం లేని శరీరంలోని ప్రతీ అవయవం కొరడా దెబ్బలు తిన్నట్టుగా విలవిలలాడింది. కళ్ళలో సూదులు గ్రుచ్చుతున్న ఫీలింగ్. ఆమె కళ్ళు చింతనిప్పుల్లా ప్రజ్వరిల్లుతున్నాయి. కొరివి మంటలు పిలుస్తున్నాయి. నిన్ను కసితీరా చంపుతానన్నట్లుగా కసిగా ఆమె కళ్ళు నవ్వుతున్నాయి. పెద్దగా అరచి కళ్ళు మూసుకున్నాడు కుమార్.

ఓ నిమిషం అనంతరం కళ్ళు తెరచి చూసాడు కుమార్. ఎదురుగా ఎవరూ లేరు. ఉదయం ఎప్పుడో కాస్త కాఫీ గొంతులో పోసి వెళ్ళిపోయింది కుమార్ భార్య విశాలాక్షి. కుమార్‌లో కరుణా టీచర్ చూసిన చూపులు కనుమరగవ్వలేదు. ఇంకా కళ్ళ ఎదుటే ఆమె వున్నట్లుగా వుంది. టీచర్ కళ్ళలో మృత్యువు తనను పిలుస్తున్నట్లుగా వుంది.

తాము విజయవాడలో వుండగా, తమ పక్కింట్లో వుండేది కరుణా టీచర్.

ఆమె కోప్పడడం, చిరాకు పడడం తను ఎప్పుడూ చూడలేదు. ఆమె మాటలు కూడా చాలా సౌమ్యంగా వుంటాయి. తాము విజయవాడ నుండి ఏలూరు వచ్చి స్థిరపడినా ఆమె విజయవాడలోనే వుండిపోయింది. అక్కడే రిటైర్డ్ అయినట్లు ఎప్పుడో తనకు తెల్సింది. కరుణా టీచరు నిజంగా కరుణా దేవతే- కానీ ఆమె కళ్ళు? సందేహం లేదు- ఆ కళ్ళు ఆమెవి కాదుగా- ఆ కళ్ళను ఎక్కడో చూసిన జ్ఞాపకం. ఆమె కళ్ళలో దైన్యం, ప్రేమ, కసి, అన్నీ కలబోసినట్లుగా వున్నాయి. అవి నాకు పరిచయం వున్న కళ్ళు! అమ్మా... గట్టిగా అరిచాడు కుమార్.



* * *

అమ్మ మహాలక్ష్మికి నలుగురు కొడుకులు- అమ్మ మహాలక్ష్మి ఈ కాలంలో వుండాల్సిన మనిషి కాదు. మానవతా విలువలు, నైతిక విలువలు సమసిపోయిన నేటి రోజుల్లో, ఇలాంటి అమ్మ వుండడం అతిశయోక్తే. నలుగురు కొడుకులూ నాలుగుదారులయ్యాక, నాన్న వెంకట్రామయ్య విరక్తితో ఎటో వెళ్ళిపోయాడు. దేవతలాంటి మహాలక్ష్మిని ఏకాకిని చేసి పారిపోయిన వెంకట్రామయ్య నిజంగా రాముడే, సీతని విడిచిన రాముడు. రామయ్య అదృశ్యంతో మహాలక్ష్మి బెంగపడి చిక్కి శల్యమైంది. ఆమెకు మనోవ్యాధి తప్ప- ఏ వ్యాధి లేదని డాక్టర్ ధృవీకరించాడు. అమ్మ హఠాత్తుగా మౌనం వహించింది. పక్కింటివాళ్ళ టెలిగ్రామ్ పుణ్యమా అని, ముగ్గురు కొడుకులూ వచ్చి అమ్మను హాస్పటల్‌లో జాయిన్ చేసారు.

మూడు నెలలు గడిచినా అమ్మ మహాలక్ష్మి కోలుకోలేదు. అప్పటికే చాలా డబ్బులు ఖర్చుచేసామని, యింకా ఈ హాస్పటల్ చుట్టూ తిరిగితే తమ ఉద్యోగాలు ఊడిపోతాయని, అర్జంటుగా వచ్చి అమ్మను కొంతకాలం చూసుకోమని చివరివాడైన కుమార్‌కి ఫోన్ చేసారు అన్నలు.

అమ్మ పరిస్థితికి చలించి పోయాడు కుమార్. కానీ - తన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అయినా అమ్మను కొంతకాలం చూడక తప్పదు. కబురందిన వారానికి అమ్మవద్దకు బయలుదేరాడు కుమార్.

హాస్పటల్‌లో బెడ్‌పై శవంలా పడి వుంది అమ్మ. అమ్మా- అమ్మా అని గట్టిగా ఏడ్చాడు కుమార్. అమ్మా ఒక్కసారి నన్ను చూడమ్మా- ఒక్కసారి మాట్లాడమ్మా- గద్గద స్వరంతో అన్నాడు కుమార్.

ఇంపాజిబుల్- మీ అమ్మ యిక చూడడం కానీ- మాట్లాడడం గానీ చేయలేదు. ఆమె "కోమా"లో వుంది. ఈ డాక్టర్ నిరంజన్ ఏది చెపితే అది జరిగితీరుతుంది. నీ పేరు కుమార్ కదూ? మా తమ్ముడు కుమార్ వచ్చి, మా అమ్మ ఆరోగ్యం సంగతి చూసుకుంటాడని మీ అన్నలు చెప్పారు. చివరగా యాభైవేల రూపాయలు కౌంటర్‌లో కట్టి వెళ్ళిపోయారు. ఆ డబ్బు ట్రీట్‌మెంటు నిమిత్తం అయిపోయింది. పేషెంటు తరపు వారు ఎవరూ లేకపోయినా- కుమార్ అనే నువ్వు వస్తావనే నమ్మకంతో వారంరోజులూ కంటికి రెప్పలా కాపాడాం. డాక్టర్ నిరంజన్ తన సుదీర్ఘ ప్రసంగాన్ని ముగించాడు.

మా అమ్మను యింటికి తీసుకుపోవచ్చునా డాక్టర్... దీనంగా అడిగాడు కుమార్. వై నాట్?- జమా ఖర్చులు బేలన్స్ చేయగా పాతిక వేలు చెల్లించాల్సి వుంది. డబ్బు చెల్లించి పేషెంటుని తీసుకుపోండి. డాక్టర్ మాటలకు

షాక్ తిన్నాడు కుమార్. పాతిక వేలు చెల్లించి అమ్మను యింటికి తీసుకువెళ్ళే స్థోమత తనకు లేదు. కుమార్ భావాన్ని పసిగట్టాడు డాక్టర్.

చూడు మిష్టర్ కుమార్- మీ అన్నయ్యలు తిరిగి వచ్చి మీ అమ్మను తీసుకువెళ్ళే అవకాశం లేదు- వారి శక్తికొలదీ వారు డబ్బు ఖర్చుచేసారు. ఏదో వారి తృప్తి కోసం ఆమెను అలా వుంచారు గానీ మీ అమ్మ బ్రతికే అవకాశం ఎప్పుడో చేజారిపోయింది.

పెద్దగా శబ్దం అవడంతో అటువైపు చూసారు కుమార్, డాక్టర్ నిరంజన్. అమ్మ మహాలక్ష్మి మంచంమీద నుండి క్రిందకు జారిపడి వుంది. గబాలున నాడిని పరీక్షించాడు డాక్టర్. - అమ్మ చనిపోయింది.

నువ్వు ఏడ్చి లాభంలేదు కుమార్, ముందు జరగాల్సింది చూడు. హాస్పటల్‌కి కట్టాల్సిన పాతిక వేలు కట్టి, శవాన్ని తీసుకువెళ్ళు- ఖరాఖండిగా చెప్పాడు డాక్టర్.

ఆఖరున వచ్చి ఇరుక్కుపోయినందుకు విలవిల లాడాడు కుమార్. సార్... నా దగ్గర డబ్బులు లేవు- నా భార్య నగలు అమ్ముదామన్నా, నా భార్య ఒప్పుకోదు. ఈ పరిస్థితిని నేను పరిష్కరించలేను. ప్రాధేయతగా అన్నాడు కుమార్. సరే! ఓ అరగంటలో పరిష్కారం చెపుతాను- నేను చెప్పిన దానికి ఓకే అయితే సరే! లేదా నిన్ను నిర్బంధించాల్సి వుంటుంది, కఠినంగా చెప్పాడు డాక్టర్.

అరగంట ఆవిరైపోయింది. డాక్టర్ నిరంజన్ గొంతు సవరించుకున్నాడు. నేను చెప్పింది జాగ్రత్తగా విను కుమార్! ఇదంతా కామన్. చాలాచోట్ల విరివిగా జరుగుతున్నదే- ప్రస్తుతం నువ్వు పాతికవేలు చెల్లించలేవు కాబట్టి, నీ సమస్యకి ఇదే పరిష్కారం. మీ అమ్మ చనిపోయిన మాట నిజమే- అయితే ఆమెకు ఎటువంటి జబ్బూ లేదు. కేవలం మానసిక వ్యధలోనే చనిపోయింది.

చనిపోయిన మీ అమ్మను దహనం చేయక తప్పదు. కానీ- ఆమె శవాన్ని విడిపించుకునే స్థోమత నీకు లేదు. కాబట్టి...ఆమె శరీరంలోని కొన్ని పార్టులు మేము తీసుకుంటాం. మీ అమ్మ శరీరంలోని కిడ్నీలు, కళ్ళు- మొదలైనవి మాకిస్తే- అవి వేరొకరికి జీవితాన్ని ప్రసాదిస్తాయి. ప్రస్తుతం నేత్రదానం, రక్తదానంలా శరీర దానం నేడు మంచి స్లోగన్‌గా మారింది. నువ్వు చేస్తున్నది తప్పుకాదు. నేను చెపుతున్నది నా వృత్తిపరంగా తప్పుకాదు. మరో యాభైవేలు నీకు తిరిగి యిస్తాం. మీ అమ్మ దహన సంస్కారాలు మేమే చేస్తాం. నువ్వు అనాధ శవంగా వదిలేస్తే, ఆ యాభైవేలూ మీకు మిగులుతాయి. కానీ, వృత్తికి ద్రోహం చేయడం నేరం. ఈ విషయం బయటకు ఎవరికీ తెలీదు- ప్రసంగం ముగించాడు డాక్టర్.

డాక్టర్ మాటలు నిజమే అనిపించాయి కుమార్‌కి. ప్రస్తుతం పాతిక వేలు కట్టి శవాన్ని తీసుకువెళ్ళే స్థోమత తనకు లేదు. డాక్టర్ చెప్పినట్లు చేస్తే డబ్బు ముడుతుంది. తల్లికి దహన సంస్కారాలు చేసాడనే పేరూ నిలుస్తుంది.

అమ్మకన్న నలుగురు కొడుకుల్లోకెల్లా- ఆఖరి కొడుకే మంచివాడని లోకం అనుకుంటుంది.

ఓకె డాక్టర్- మీరు చెప్పిన దానికి నేను అంగీకరిస్తున్నాను అన్నాడు కుమార్.

సాయంత్రం ఆరు గంటలైంది. అమ్మ శవాన్ని వ్యానులో పడేసుకుని శ్మశానానికి తీసుకుపోయారు హాస్పటల్ సిబ్బంది.

డాక్టర్ నిరంజన్ ఇచ్చిన యాభైవేలూ బ్యాగులో పెట్టుకుని హాస్పటల్ గేటు దాటి రోడ్డుమీదకు ప్రవేశించాడు కుమార్.

అంతా గందరగోళంగా అనిపించింది కుమార్‌కి.



చనిపోయిన మీ అమ్మను దహనం చేయక తప్పదు. కానీ- ఆమె శవాన్ని విడిపించుకునే స్థోమత నీకు లేదు. కాబట్టి...ఆమె శరీరంలోని కొన్ని పార్టులు మేము తీసుకుంటాం. మీ అమ్మ శరీరంలోని కిడ్నీలు, కళ్ళు- మొదలైనవి మాకిస్తే- అవి వేరొకరికి జీవితాన్ని ప్రసాదిస్తాయి. ప్రస్తుతం నేత్రదానం, రక్తదానంలా శరీర దానం నేడు మంచి స్లోగన్‌గా మారింది.

కళ్ళు మూతలు పడుతున్నాయి. రోడ్ మధ్యలో నిల్చుని ఒకామె పిలుస్తున్నట్లుగా అనిపించింది కుమార్‌కి. అనాలోచితంగా ముందుకు నడిచాడు. రోడ్‌కి అడ్డంగా వస్తున్న కుమార్‌ని, అతి వేగంగా దూసుకువస్తున్న ఆటో దబేలున ఢీకొట్టింది. ఎగిరి దూరాన పడ్డాడు కుమార్.

★ ★ ★

సందేహం లేదు. కరుణా టీచర్‌కి అమర్చిన కళ్ళు అమ్మ మహాలక్ష్మివే! అందుకే ఆమె తనను చంపేసేలా చూసింది. అమ్మ నన్ను మళ్ళీ చూసింది. అమ్మకు చేసిన ద్రోహానికి చావుకి దగ్గరయ్యాను. నా పరిస్థితులే నన్నలా మార్చాయని అమ్మ అర్థంచేసుకోవడం లేదు. తనను ముక్కలుగా కోయించి అమ్మేసాననుకుంటుంది. అందుకే యాక్సిడెంట్ రూపంలో వచ్చి నన్ను జీవశ్చవాన్ని చేసింది.

కొడుకుని చంపుకునే తల్లులుంటారా అమ్మా... నేను చేసింది తప్పే- నిన్ను అనాధ శవంలా వదిలేసినా, ఆ హాస్పటల్‌వారు, నిన్ను ముక్కలుగా కోసి వారికి కావాల్సినవి వారు తీసుకుంటారు. నేను 'ఊ' అనడం నేను చేసిన ఘోరమైన నేరమా?! నువ్వు అనాధ శవంగా మారడానికి, మా నలుగురు అన్నదమ్ములకీ భాగం వుంది. కానీ- శిక్ష నాకే వేసావు. అంటూ భోరున ఏడ్చాడు కుమార్.

హఠాత్తుగా మెలుకువ వచ్చి చూసాడు కుమార్. డాక్టర్ నిరంజన్‌తో ఏదో మాట్లాడుతుంది కుమార్ భార్య విశాలాక్షి. తన భార్య నిజంగా దేవత అనుకున్నాడు కుమార్. తనకోసం ఆమె నగలన్నీ తెగనమ్మి చికిత్స చేయించింది. డాక్టర్ నిరంజన్, విశాలాక్షి మాట్లాడుకుంటున్న విషయం కనబడడం తప్ప, వినబడడం లేదు కుమార్‌కి.

డాక్టర్- డబ్బు సర్దుబాటు చేసుకోవడం నా తరం కాదు. యాక్సిడెంట్ జరిగినప్పుడు- ఆయనవద్ద యాభైవేలున్నాయి. అవి ఎక్కడివో నాకు తెలీదు. ఆ యాభైవేలూ ఖర్చు అయిపోయాయి. నా నగలు అమ్మి తెచ్చిన డబ్బులూ ఖర్చయిపోయాయి. అయినా యింకా నలభైవేలు ఫీజుగా చెల్లించడం- తిరిగి మరి కొంతకాలం చికిత్స చేయించడం నా తరం కాదు. బయట అప్పు దొరకదు. చివరకు నా పిల్లలకు ఓ దారి లేకుండాపోయింది. వారికి ఆర్థికపరంగా ఏ ఆధారమూ లేదు. ఇల్లు గడవడం కూడా కష్టంగా వుంది.

విశాలాక్షి పరిస్థితి అర్థం అయినట్లుగా నిట్టూర్చాడు డాక్టర్. సరేనమ్మా- నీ పరిస్థితి నాకు అర్థం అయ్యింది. మీ ఆయన బ్రతికున్నా- తన పని తాను చేసుకోలేడు, పైగా ఎంతో కాలం బ్రతికే అవకాశం లేదు. కోమాలో వున్న పేషెంటుకంటే హీనమైన పరిస్థితి కుమార్‌ది. నీ పరిస్థితిని బట్టీ నేనొక ఆలోచన చెపుతాను అన్నాడు డాక్టర్- చెప్పండి అంది విశాలాక్షి.

డాక్టర్ చెప్పిన విషయం విని విస్మయం చెందింది విశాలాక్షి. రెండు నిమిషాలు ఇద్దరి మధ్యా మౌనం. చివరగా ఓకె సార్ అంది విశాలాక్షి!

తన వైపు వస్తున్న విశాలాక్షిని పరిశీలనగా చూసాడు కుమార్. తనకు యాక్సిడెంట్ అయినప్పటి నుండీ తనను సాకిన భార్యలా లేదు ఆమె. నిండా చిరునవ్వుతో తనవైపు చూస్తూ వస్తుంది. సమస్యలు పరిష్కారం అయినట్లుగా వుంది ఆమె మొఖం.

ఓ మై గాడ్! డాక్టర్ నిరంజన్ రిలాక్స్‌గా వెళ్ళిపోవడం- విశాలాక్షి హావభావాలు మారడం- యివన్నీ నాకు అర్థం అయిపోయాయి. అమ్మ నన్ను పిలుస్తుంది! మృత్యువు నన్ను కబళిస్తుంది!!. అమ్మను "అమ్మ"కం చేసిన పాపానికి నాకిదే సరైన శిక్ష. భగవంతుడా- తిరిగి అదే పాపం చేస్తున్న నా భార్యకు ఏ శిక్ష విధిస్తావో- మానవ సంబంధాలు యింత నీచంగా మార్చవేమయ్యా- డబ్బును మానవుడు సృష్టించుకుంటే- మమ్మల్ని సృష్టించిన నువ్వు మాయం అయిపోయావు. ఈ డబ్బు రాకాశి సమసిపోయేవరకూ. నాలాంటి కొడుకులు పుడుతూనే వుంటారు. అమ్మను "అమ్మ"కం చేస్తుంటారు. అమ్మా, నన్ను క్షమించు. అమ్మ నన్ను పిలుస్తుంది... గట్టిగా కళ్ళు మూసుకున్నాడు కుమార్.

★